కథ

# గురుబ్రహ్మ

అగస్త్యప్రగడ హేమంత



'శ్రీ నటరాజ నృత్య నిలయం.'

తళతళ మెరుస్తున్న బంగారు రంగు అక్షరాల్ని ఆప్యాయంగా చూసుకుని లోపలికి అడుగు పెట్టాడు భరత్.

నటరాజ నృత్య నిలయం నాగేశ్వరశర్మగారి ఆధ్వర్యంలో ఇరవై ఏళ్ళ నుంచి నడుస్తోంది. ఎందరెందరో అందులో నృత్యం అభ్యసించారు. శర్మగారి ఆధ్వర్యంలో మరెన్నో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్నెన్నో సన్మానాలు పొందారు. విదేశాల్లో పర్యటించి స్వదేశం తిరిగి వచ్చిన వారందరూ తాము నాగేశ్వరశర్మగారి శిష్యులమని గర్వంగా చెప్పుకునేవారు.

అలా చెప్పుకున్న వాళ్ళందరూ 'పర్ణశాల'గా మొదలయిన నృత్య నిలయాన్ని భవంతిగా మార్చేశారు. రోజు రోజుకీ, ఆ మహా పట్టణంలో శర్మగారి పేరు, ప్రఖ్యాతులు పెరిగాయే తప్ప తగ్గలేదు. అందుకు ఆయన కళోపాసనే కాదు... నిగర్వం కూడా ఒక కారణం. అలాంటి శర్మగారి శిష్యుల్లో భరత్ ఒకడు.

హాల్లో ప్రవేశించిన భరత్ ఎదురుగా ఉన్న నిలువెత్తు నటరాజ విగ్రహానికి నమస్కరించాడు. వినాయక ప్రార్థన మొదలు పెడదామనుకున్నంతలోనే "గురువుగారు పిలుస్తున్నారు" అంటూ కబురొచ్చింది.

విశాలంగా ఉన్న గదులన్నీ దాటి నాగేశ్వరశర్మగారి గదిలోకి అడుగు పెట్టాడు భరత్.

"నువ్వు ఎ.ఇ.గారి ఇంటికి వెళ్ళి వాళ్ళమ్మాయికి నృత్యం నేర్పాలి" భరత్ నుద్దేశించి చెప్పారు శర్మగారు.

ఆ మాటలు వింటూనే భరత్ ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే నాట్యం కావలసిన వాళ్ళు తప్పనిసరిగా నృత్య నిలయంలో తన ఆధ్వర్యంలో నృత్యం నేర్చుకోవాలనేది శర్మగారి నియమం. కానీ ఆయన అందుకు విరుద్ధంగా మాట్లాడేసరికి గురువుగారి వైపు ఆశ్చర్యంగా చూశాడు భరత్. అతని ఆశ్చర్యానికి సమాధానంగా— "ఆమె మన నృత్య నిలయం విద్యార్థిని. నువ్వామెకి కొత్తగా ఏమీ నేర్పనవసరంలేదు. ఆమె ప్రదర్శన ఇవ్వాలనుకుంటోంది. కనుక కావలసిన తర్ఫీదు ఇస్తే చాలు" చెప్పి ఓ చిన్న పేపర్ మీద ఎ.ఇ.గారి ఇంటి అడ్రస్ రాసిచ్చి "నేను పంపానని చెప్పు" అని చెప్పి మరో వైపు వెళ్ళిపోయారు శర్మగారు.

★ ★ ★ ★ ★

అధునాతనంగా కనిపిస్తున్న ఓ భవంతి ముందు సైకిలాపి అడ్రస్ కరెక్టేనని మరోసారి నిర్ధారించుకుని గేట్ తీసుకుని లోపలికి అడుగు పెట్టాడు భరత్.

వెళ్ళీ వెళ్ళగానే ఆర్భాటంగా అతనికి ఎదురొచ్చింది అసిస్టెంట్ ఇంజనీర్ గారమ్మాయి.

ఎర్రంచు తెల్ల పట్టు పరికిణీలో, ఎర్రఓణీతో కుందనపు బొమ్మలా మెరుస్తున్న ఆమెని చూడగానే భరత్ హృదయం లయ తప్పింది. ఆమె తమ నృత్య నిలయం విద్యార్థిని అయినా అంతకు ముందెప్పుడూ ఆ బంగారు తీగెని అతను చూడలేదు.

"మీ రొస్తారని గురువుగారు చెప్పారు. మీ కోసమే ఎదురు చూస్తున్నాను. రండి..." సాదరంగా ఆహ్వానించిందామె.

తియ్యగా తీగ సాగుతున్న ఆ స్వరమాధురికి అతను పూర్తిగా ఒళ్ళు మర్చిపోయాడు.

మృదువుగా ఎర్ర తామరల్లా ఉన్న మెత్తని చేతుల్తో ఆమె అందించిన కాఫీని చాలా ఆప్యాయంగా అందుకున్నాడు.

"మొదట గురువుగారు ఇంటి దగ్గర చెయ్యడం కుదరదని చెప్పేశారు. కానీ నాకు ఎగ్జామ్స్ ఉన్నాయని చెబితే కాదనలేదు... అందుకే మిమ్మల్ని పంపారు" గలగలా మాట్లాడుతోంది. కాఫీతోపాటు ఆమె మాటల గలగలల్ని కూడా ఆస్వాదిస్తున్నాడతను.

"మీ పేరేమిటి చిన్న గురువుగారూ!" అంటూ ఉన్నట్టుండి హఠాత్తుగా ఆమె అడిగిన ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడతను. అప్పటి దాకా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కడానికన్నట్టుగా రెప్ప వాల్చని అతను అప్పుడు చూపు తిప్పుకుని కళ్ళు దించుకున్నాడు.

"భరత్" ఖాళీ కప్పు కింద పెట్టడానికి వంగుతూ అన్నాడు.

"ప్చ్... మేం ఉన్నదే మీ సేవలు చేసుకోవడా

నికి... మీరంత కష్టపడనవసరంలేదు గురువుగారూ!'' చిలిపిగా నవ్వుతూ కప్పు అందుకుంటూ అంది.

ఆ మాట వెనకున్న అంతరార్థం ఏమిటో అతనికి అర్థం కాలేదు. అర్థం వెతుక్కోవడానికి అన్నట్టుగా ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు. అతనలా చూడ్డంతో సిగ్గుగా తలదించుకుంది.

"ఇంతకీ నీ పేరేమిటి?'' లేచి నిలబడుతూ అడిగాడు.

"ఊర్వశి.''

"ఊర్వశి...'' అప్రయత్నంగా ఆశ్చర్యంగా ఆమె పేరుని మరోసారి ఉచ్చరించాడు.

"ఏం గురువుగారూ! బావుండలేదా?''

"అద్భుతం'' చటుక్కున అనేశాడు భరత్.

"ప్రాక్టీస్ మొదలుపెడదామాండీ!'' అని ఊర్వశి అడిగేంతవరకూ అతను ఊహల్లోంచి బయటపడలేకపోయాడు.

వినాయక ప్రార్థన పూర్తయింది.

"ఆంగికం భువనం యస్య
వాచకం సర్వ వాఙ్మయం
ఆహార్యశ్చంద్రతారాది
తం, వందేహం సాత్త్వికం శివం''—అంటూ మనస్ఫూర్తిగా నటరాజుకి నమస్కరించాడు. "సముద్రవసనేదేవీ...'' అంటూ శ్లోకాన్ని గాంభీర్యంగా చదువుతూ "భూదేవీక్షమస్వమే...'' అనుకుంటూ క్షమాభిక్ష కోసం చేతుల్ని నేలమీద ఆనించిన అతనికి, నృత్యం చెయ్యడానికి అనువుగా పైకి దోపిన పరికిణీ, ఆ కింద పాలరాతి శిల్పం అందాల్ని విరజిమ్ముతూ తెల్లటి ఊర్వశికాళ్ళూ ఒక్కక్షణంఅతన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. చదువుతున్న శ్లోకం చెయ్యాల్సిన పనీ, మొత్తం మర్చిపోయి ఒక్క నిమిషం అలాగే ఉండిపోయాడు.

"పాద స్పర్శం క్షమస్వమే... పాదఘాతం క్షమస్వమే.'' మిగిలింది పూర్తిచేసింది ఊర్వశి. ప్రార్థన పూర్తి చేసి పైకి లేచాడతను.

"నువ్వు చెయ్యవేం?'' యథాలాపంగా అడిగినా కాస్తంత కటుత్వం ధ్వనించిందతని స్వరంలో.

"మీరు చేశాకా చేద్దామని'' నసిగింది ఊర్వశి. ఆమె ముఖంలో కనిపించిన అమాయకత్వానికి అతను చలించిపోయాడు. తన 'తప్పు'కి ఆమెని కోప్పడడం అన్యాయమనిపించి అపరాధిలా ఫీలయ్యాడు.

"రేపట్నించి మడీదార్‌లో ప్రాక్టీస్ చెయ్యి'' ఆమె కాళ్ళ మీదికి తన చూపులు మళ్ళకుండా జాగ్రత్తపడుతూ ఆజ్ఞాపించాడు.

'అలాగే' నన్నట్టు తలూపింది.



డాన్స్ ప్రాక్టీస్ మొదలయింది. తరచూ ఊర్వశి 'అడుగులు' తప్పుగా వెయ్యడంతో రెండు మూడుసార్లు ఆమెని హెచ్చరించాడు. 'శిల్పం' కూడా పూర్తిగా రాకపోవడంతో సరైన భంగిమ కోసం ఆమె చేతుల్ని ముఖాన్ని, భుజాల్ని, ముట్టుకోక తప్పలేదతనికి.

తాకింది వేలి కొసలతోనైనా ఆ కాస్త స్పర్శే అతనికి వేయి వేల విద్యుద్ఘాతాలయ్యాయి. అయినా తమాయించుకుని, ఆరోజుకి ఏదో అయిందనిపించాడు.

అదేలాంటి అవకతవకలతో మరో రెండు రోజులు గడిచాయి.

భరత్‌కి ఒకవైపు ఊర్వశి మీద ఇష్టంగా ఉంది. మరోవైపు కోపంగానూ ఉంది. ఒకవైపు ఆమెని 'తాకడం' ఆనందంగా ఉంది. మరోవైపు ఆంగికం సరిగా లేకపోతే ఎలా? అన్న ఆందోళన ఉంది. ఈ రెండిటి మధ్య అతనిలో సంఘర్షణ మొదలయింది.

ఆరోజు కూడా ఎలాగో పూర్తయిందనిపించాడు.

"వెళ్ళొస్తాను ఊర్వశీ'' టైమ్ చూసుకుంటూ అన్నాడు.

"అప్పుడేనా?'' దీనంగా అంది. ఆ మాట అంటున్నప్పుడు ఆమె ముఖంలో స్వరంలో ధ్వనించిన 'విరహం' అతనికి సూటిగా తగిలింది.

"రేపు 'త్వరగా' ఒచ్చెయ్యండి'' 'త్వరగా' అన్న పదాన్ని నొక్కి పలికింది.

అప్పుడే పరిశీలనగా ఆమె ముఖంలోకి చూశాడు. అతనలా చూడ్డంతో కళ్ళలో కళ్ళు కలపలేక సిగ్గుగా తలవంచుకుంది ఊర్వశి.

అది చాలు. భరత్‌కి ఆమె పరిస్థితి పూర్తిగా అర్థం కావడానికి.

రోజూ అడుగులు తప్పు పడడం, ఆంగికం సరిగా లేకపోవడం, విరహం అమోఘంగానూ, సిగ్గుని మనోహరంగానూ, అభినయించడం, మిగిలిన రసాల విషయానికొస్తే హావభావాలు సరిగా అభినయించలేకపోవడం ఎందుకో భరత్‌కి బాగా అర్థమైంది. ఆ నిమిషంలోనే అతనో నిర్ణయానికి ఒచ్చేశాడు.

★ ★ ★ ★ ★

"నేనామెకి నృత్యం నేర్పలేను గురువుగారూ!'' నెమ్మదిగా అయినా స్థిరంగా చెప్పాడు భరత్.

"ఎందుకని?'' సూటిగా అడిగారాయన.

"ఆమెని చూడగానే నా హృదయం లయ తప్పుతుంది. ఆమెని తాకితే నా మనసు వశం తప్పుతుంది. ఆ అందమైన కళ్ళు చూపుల తూపుల్ని కనుబొమల ధనువుపై ఎక్కుపెట్టి విసురుతుంటే ఆ తాకిడికి నా ఎద ముక్కలౌతోంది. నేను పూర్తిగా వివశుడినౌతున్నానుతప్ప ఓ గురువుగా ఆమెకి పాఠం నేర్పలేకపోతున్నాను.

సన్నని ఆమె నడుమూ, గుండ్రని అందమైన ముఖం, చక్కటిచేతులూ, మృదువైనపాదాలూ, అందుకు తగ్గ హావభావాలూ, ఒంపుసొంపులూ, నన్ను పూర్తిగా చిత్తు చేస్తున్నాయి. గురువంటే తండ్రిలాంటి వాడని ఇన్నాళ్ళూ భావించేవాడిని. ఇన్నాళ్ళూ అందరి విషయంలో అలాగే వ్యవహరించాను.కానీ ఒక్క ఊర్వశి విషయంలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది. ఈ విరుద్ధ పరిణామాలకి కారణం ఆమెలో ఉన్న ఆకర్షణ కావచ్చు''— అని చెప్పాలనుకున్నాడు. కానీ ఏదీ చెప్పలేకపోయాడు.

"కారణం అడిగితే మాట్లాడవేం?'' మరోసారి రెట్టించారాయన.

'ఆమె వయసు పదహారు. పైగా ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. నా వయసు పాతిక. ఆ ఆకర్షణని ఛేదించగల మరో నిబ్బరం నాకు లేదు. అందుకే నేనామెకి నృత్యం నేర్పలేను. క్షమించండి' వినయంగాచెప్పి బైటకొచ్చేశాడు భరత్.

"గురు శిష్య సంబంధాన్ని'' జాగ్రత్తగా కాపాడుతున్న భరత్ వైపు చూస్తూ గర్వంగా నిట్టూర్చారు శర్మగారు. ●